కొలువైన దుర్గామాత!



పాలకుర్తి సోమేశ్వరాలయంలో..

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలో దసరా పండగను పురస్కరించుకుని దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్‌లోని గణపతి దేవాలయ ప్రాంగణం, హైదరాబాద్ రోడ్డు వైపు శ్రీవిల్లాస్ కాలనీ, బొడ్రాయి ప్రాంతంతో పాటు గుండ్లగడ్డ ఉమామహేశ్వర దేవాలయం ప్రాంగణంలో దుర్గా మాత విగ్రహాలను ప్రతిష్ఠించి, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



జనగామ శ్రీవిల్లాస్ కాలనీలో..

అపరిచిత బెదిరింపులను నమ్మొద్దు: అనిశా డీఎస్పీ

జనగామ టౌన్, న్యూస్‌టుడే: గత కొద్ది రోజులుగా జనగామ జిల్లా పరిధిలోని పలు ప్రభుత్వ శాఖ కార్యాలయాల్లో పని చేస్తున్న అధికారులకు అవినీతి నిరోధక శాఖ అధికారులమని చెపుతూ.. 'మీపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయని బెదిరిస్తూ, కొంత నగదును ఆన్‌లైన్ ఖాతా ద్వారా పంపించమని' అపరిచిత వ్యక్తులు ఫోన్లు చేస్తున్నారు. ఈ విషయాన్ని పలు శాఖల అధికారులు వరంగల్ అనిశా డీఎస్పీ సాంబయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫోన్లు చేస్తే సంబంధిత విషయాన్ని సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సూచించారు. అనిశాకు ఫిర్యాదు చేయాలంటే 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పైసలు లేవు.. పండగ ఏర్పాట్లు ఎలా?

- గ్రామాలకు అందని కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు

ఈనాడు, వరంగల్

బతుకమ్మ, దసరా రాష్ట్రంలో పెద్ద పండగలు. ప్రజలంతా ఒక్కచోట చేరి చేసుకునే వేడుకలు. ఈసారి పల్లెల్లో పండగ ఏర్పాట్లు ఎలా చేయాలని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదని వాపోతున్నారు.



ఇదీ పరిస్థితి..

హనుమకొండ జిల్లా దామెర మండలం పంచాయతీ కార్యదర్శులు గత నెల 20న మండల పరిషత్తు అభివృద్ధి అధికారికి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం ఇస్తున్నారు. గ్రామాల్లో తీవ్ర నిధుల కొరత ఉందని, బతుకమ్మ, దసరా పండగల ఏర్పాట్లు మోయలేని భారంగా మారాయని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ పరిస్థితే నెలకొంది.



ఇది వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలోని చెరువు. సద్దుల బతుకమ్మ వేడుకలను ఇక్కడే నిర్వహిస్తారు. మరో రెండు మూడు రోజుల్లో చెరువు కట్ట మీద పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉంది.

- ఈ ఆర్థిక సంక్షోభం సమయంలో ఈసారి బతుకమ్మ, దసరా పండగలకు చెరువు కట్టల వద్ద విద్యుత్తు దీపాల ఏర్పాటు, కట్టలపై జంగిల్ కట్టింగ్, డీజే సౌండ్ ఏర్పాటు లాంటివి ఏర్పాటుచేసేందుకు తమ వద్ద డబ్బులు లేవని కార్యదర్శులు ఉన్నతాధికారులకు వినతులు ఇస్తూ నిధుల కోసం వేడుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్‌లో వందలాది గ్రామాల్లో ఏర్పాట్లు ఎలా చేసేది అంటూ కార్యదర్శులు దిగులు చెందుతున్నారు.

ఫిబ్రవరిలో సర్పంచుల పదవీ కాలం పూర్తయిన తర్వాత కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. రాష్ట్రం నెలనెలా అందివ్వాల్సిన ఆర్థిక సంఘం డబ్బులు ఎన్నో నెలల తరబడి గ్రామాలకు అందడం లేదు. దీంతో ఇప్పటికే మోటార్ల మరమ్మతు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, వీధి దీపాల మరమ్మతుల కోసం తాము అప్పులు చేసి గ్రామ పాలన నడిపిస్తున్నామని కార్యదర్శులు చెబుతున్నారు.

- ములుగు 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.5.59 కోట్ల బకాయిలు గ్రామాలకు రావాల్సి ఉంది. ఈసారి బకాయిలు మూడు రెట్లకన్నా ఎక్కువగా పేరుకుపోవడంతో అనేక ఏజెన్సీ గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది.



ఇది వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీ గ్రామం. బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో డోజర్లు లేదా ట్రాక్టర్లతో మొక్కలను తొలగించాల్సి ఉండగా నిధులు లేకపోవడంతో పంచాయతీలోని మల్టీ పర్పస్ కార్మికులే చేతితో మొక్కలు పీకేస్తున్నారు. ఇలా అనేక పంచాయతీలకు అందాల్సిన నిధులు రాక పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్నింటికీ ఉద్దరే..

మేజర్ పంచాయతీలకు అంగడి ద్వారా ఆదాయం రావడంతో వారు వివిధ రకాల ఖర్చులకు సర్దుబాటు చేస్తున్నారు. చిన్న పంచాయతీలకు ఆదాయ వనరులు లేకపోవడంతో కార్యదర్శులు అప్పులు చేసి మరీ అవసరాలు తీరుస్తున్నారు. ఆర్థిక స్తోమత లేని వారు దుకాణాల్లో ఉద్దెర తెస్తున్నారు. గ్రామ సభలు ఏర్పాటుచేసినప్పుడు టెంట్ హౌజ్‌లు, ఎలక్ట్రిక్ బల్బులతోపాటు చిన్న చిన్న వస్తువులన్నీ సగం చెల్లించి మిగతాది ఉద్దెరగా తెస్తున్నామని చెబుతున్నారు. ప్రస్తుతం డెంగీ, విష జ్వరాలు విజృంభిస్తున్న క్రమంలో బ్లీచింగ్ పొడి కొనేందుకు, దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేసేందుకు డబ్బులు లేవని ఇప్పుడు పైసలు లేకుండా పండగలు చేయడం తలకు మించిన భారం అవుతుందని కాబట్టి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిధి తక్కువే

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు నిధులు రాకపోవడంతో ప్రభుత్వం ఇప్పుడు తాత్కాలికంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.162 కోట్లను జీవో ద్వారా విడుదల చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఒక్కో గ్రామంలో ఏర్పాట్లకు కనీసం రూ.25 వేల నుంచి రూ.50 వేలు అంతకన్నా ఎక్కువే వెచ్చించాలి. ఈ నిధులు పంచితే దేనికీ సరిపోవని కార్యదర్శులు వాపోతున్నారు.

జిల్లాల వారీగా పంచాయతీలకు రావాల్సిన బకాయిలు

● జిల్లా	● గత ఆరు నెలలుగా రావాల్సిన బకాయిలు (రూ.కోట్లలో)	● పంచాయతీలు
ములుగు	18.85	208
హనుమకొండ	24.40	208
వరంగల్	27.95	325
జనగామ	24.76	283
మహబూబాబాద్	16.21	461
భూపాలపల్లి	18.22	240

పకడ్బందీగా కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే



కన్నాయపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

రఘునాథపల్లి, న్యూస్‌టుడే : కుటుంబ డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియను క్షేత్రస్థాయి సర్వే అధికారులు, సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. కన్నాయపల్లిలో ప్రారంభమైన సర్వేను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డులున్నవారితో పాటు లేనివారికి కూడా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రేషన్ కార్డులుండి.. అందులో నమోదైన కుటుంబసభ్యుల పేర్లలో తప్పులు, చేర్పులు, మార్పులు తదితర అంశాలను ఫార్మాట్-1లో, వివాహమై ఇప్పటివరకు రేషన్‌కార్డులు లేనివారికి ఫాం-2లో పొందుపరచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కొంరయ్య, తహసీల్దార్ మోహిన్, ఎంపీడీవో శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

జనగామ: కుటుంబ వివరాలు డిజిటల్ కార్డు కోసం జనగామ జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో ఒక్కో గ్రామాన్ని, జనగామ పురపాలిక పరిధిలో ఒక వార్డులో సర్వే ప్రారంభమైంది. గురువారం జనగామ పట్టణంలోని 24వ వార్డులో నిర్దేశిత అధికారుల బృందాలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాయి. వార్డు పరిధిలోని నాగులకుంటలో ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా పరిశీలించి, తీరుపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వెంకన్న, మున్సిపల్ అధికారులు రాములు, మధు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అయ్యేంత వరకు పోరాడుతాం..



మాట్లాడుతున్న మాజీమంత్రి దయాకర్‌రావు

తొర్రూరు, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయకుంటే ప్రభుత్వంపై పోరాటం తప్పదని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని భారాస కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎర్రబెల్లి మాట్లాడారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీనిచ్చి ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఎక్కడని ప్రశ్నించారు. ప్రభుత్వ వైకరికి నిరసనగా శుక్రవారం(నేడు) తొర్రూరులో రైతుధర్నా నిర్వహిస్తున్నామని, నిరసనకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారన్నారు. రుణమాఫీ అయ్యేంత వరకు భారాస ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. ధర్నాకు అన్నదాతలు, భారాస కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు సీతారాములు, నాయకులు డాక్టర్ సోమేశ్వరరావు, అంజయ్య, శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



సినీతార సందడి..

మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో గురువారం సినీనటి ప్రియాంక మోహన్ సందడి చేశారు. 'కాసం ఫ్యాషన్' మాల్ 13వ స్టోర్‌ను ప్రారంభించారు..

వివరాలు 6లో..

బాక్సింగ్ జట్టు ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: బాక్సింగ్ జట్టు ఎంపిక పోటీలు గురువారం హనుమకొండ జేఎన్ స్టేడియంలో జరిగాయి. బాక్సింగ్ హాలులో సబ్ జూనియర్, జూనియర్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 20 మంది బాక్సింగ్ క్రీడాకారులు హాజరయ్యారని కార్యనిర్వాహక కార్యదర్శి రాజేందర్ తెలిపారు. ప్రతిభ ఆధారంగా 11 మంది బాక్సర్లను ఎంపిక చేశామన్నారు. వీరు ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని హకీంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. శిక్షకులు ప్రభుదాస్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిద్దరోతున్న నిఘా నేత్రాలు!

- సీసీ కెమెరాలు పనిచేయక కంట్రోల్ రూమ్‌కు తాళం..

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన ఎనిమిదేళ్ల కాలంలో దాదాపు ఆరేళ్లుగా పోలీస్ శాఖాపరంగా పకడ్బందీగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిర్వహణ కూడా బాగానే చేశారు.. కానీ సుమారు రెండేళ్లుగా జనగామలో సీసీల నిర్వహణ గాలికి వదిలేయడంతో జిల్లా కేంద్రంలో చోరీల నిందితులు.. రోడ్డు ప్రమాద కారకులను గుర్తించి, ప్రశాంత పరిస్థితులను నెలకొల్పే విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో నిఘా నేత్రాలు నిద్దరోతున్నాయనే విమర్శలు వినవస్తున్నాయి.



సూర్యాపేట రోడ్డు వైపు అడ్డుగా చెట్ల కొమ్మలు

మొదట్లో ఘనంగా.. తర్వాత అస్తవ్యస్తంగా..

జనగామలో గతంలో ఇక్కడ ఏసీపీగా పని చేసిన కొత్త దేవేందర్‌రెడ్డి అప్పట్లో సీసీ కెమెరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఫలితంగా 150 నిఘానేత్రాలు అన్ని ప్రాంతాల్లో పని చేశాయి. ఇదే తీరులో జనగామ పట్టణ సీఐలుగా ఉన్న మల్లేష్‌యాదవ్, బాలాజీవరప్రసాద్, ఎల్లబోయిన శ్రీనివాస్‌ల హయాంలో బాగానే ఉన్నాయి. బాలాజీవరప్రసాద్ అయితే అవి కింద పడకుండా పట్టణం చుట్టూ 13 కిలోమీటర్ల మేర పకడ్బందీగా అమర్చారు. పట్టణ ఠాణాలో వరుస బదిలీలతో పోలీసింగ్ సేవలతో పాటు కెమెరాలను పట్టించుకునే వారు కరవయ్యారు. ప్రస్తుతం పట్టణంలో మొత్తం మీద పది నుంచి పదిహేను సీసీ కెమెరాలు కూడా సరిగ్గా పని చేయని దుస్థితి. కమాండ్ కంట్రోల్ రూం కూడా మూసి ఉంటుంది. మానిటర్లన్నీ మూలనపడ్డాయి.. పర్యవేక్షించే వారెవరూ లేకుండా పోయారు. అలాగే పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తాలో అస్తవ్యస్త ట్రాఫిక్ నిర్వహణతో ప్రమాదాలు జరుగుతున్నా, ఒక్క కానిస్టేబుల్ కూడా ఉండటం లేదనే విమర్శలున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు 'సీసీ'ల పనితీరుపై మరోసారి సమీక్ష చేసుకుని పూర్తి స్థాయిలో పని చేసేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్ రోడ్డులో ఒకటి కిందికి, మరొకటి పైకి చూస్తున్న సీసీ కెమెరాలు

నిర్వహణలో విఫలం..

జనగామ జిల్లా కేంద్రం వేగంగా అభివృద్ధి చెందుతోంది. జిల్లా కలెక్టర్ నుంచి మొదలుకుని పోలీస్ శాఖ ఉన్నతాధికారి డీసీపీ స్థాయి అధికారులు జిల్లా కేంద్రంలో ఉంటున్నారు. జిల్లా కేంద్రంలో పక్కాగా శాంతిభద్రతలను నిర్వహించడానికి పోలీస్ సిబ్బంది గస్తీ ఎంత ముఖ్యమో సీసీ కెమెరాలు కూడా అంతే ప్రాధాన్యత కలిగి ఉంటాయి. 'ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం' అంటూ పోలీస్ ఉన్నతాధికారులు చెపుతూ ఉంటారు. కాలనీల్లో నిఘానేత్రాలను ఏర్పాటు చేసుకోవాలని పదేపదే సూచిస్తున్న నిర్వహించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికే జనగామలో పలుమార్లు దాతల సహకారంతో పట్టణంలోని ప్రధాన రహదారులు, పలు వార్డుల్లో ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణ విషయంలో అధికారులు నిరంతరం చర్యలు చేపడితే బాగేండేది. రెండేళ్లుగా పట్టించుకోకపోవడంతో అంతంత మాత్రంగానే ఉన్నాయి.



ఆర్టీసీ చౌరస్తాలో మూసి ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్

వారంలోపు 70 సీసీ కెమెరాలు అందుబాటులోకి..

- పార్థసారధి, ఏసీపీ, జనగామ

సీసీ కెమెరాల నిర్వహణ గురించి బుధవారం సమీక్ష చేశాం. చాలా కెమెరాలు పని చేయని మాట వాస్తవమే. రూ.1.20 లక్షల వ్యయంతో దాదాపుగా 70ని తిరిగి అందుబాటులోకి తీసుకొస్తాం. కేబుల్ మరమ్మతులు, తదితర వాటిని సరి చేసి వారం రోజుల్లోపు అందుబాటులోకి తీసుకొచ్చేలా కృషి చేస్తాం.

విద్యుత్తు సమస్య పరిష్కరించాలని నిరసన



స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే : మండలంలోని పామునూర్ గ్రామంలో ఆరు నెలలుగా నెలకొన్న విద్యుత్తు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు గురువారం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ బుధవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు సైతం సరఫరా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో గాలి దుమారం వచ్చిందంటే విద్యుత్తు కోసం రోజుల తరబడి వేచిచూడాల్సిందేనని అన్నారు. గతంలో డీఈ, ఏడీఈ, ఏఈలు గ్రామంలో పర్యటించినా ఫలితం లేకుండా పోయిందని.. సమస్యకు పరిష్కారం లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. గతంలో శివునిపల్లి విద్యుత్తు ఉపకేంద్రం నుంచి సరఫరా అందించినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదని.. ఉప్పుగల్లు ఉపకేంద్రం నుంచి సరఫరా చేస్తున్నప్పటి నుంచి ఈ కోతలు మొదలయ్యాయని పేర్కొన్నారు. సమస్య పరిష్కరించకపోతే ఘన్‌పూర్ డీఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామస్థులు ఒగ్గు రాజు, ఎండీ అన్వర్, పొన్న బీరయ్య, పొగాకు కుమారస్వామి, తాళ్లపెల్లి రాజు, గోపాలకృష్ణ, శివారెడ్డి, యశోద, లక్ష్మీ, స్వరూప, అరుణ పాల్గొన్నారు.

పరిష్కారానికి కృషి చేస్తాం : గ్రామంలో నెలకొన్న విద్యుత్తు సమస్య పరిష్కారానికి వీలైనంత త్వరలోనే కృషి చేస్తామని ఇన్‌ఛార్జి డీఈ గడ్డం గణేష్ అన్నారు. రాత్రివేళలో చిన్న గాలి, వర్షం వచ్చినా ఫీడర్ బ్రేక్‌డౌన్ అవుతుండటంతో ఇబ్బంది ఏర్పడుతోందని వివరించారు. ప్రస్తుతం ఊరి మధ్యలోంచి నూతన లైన్ ఏర్పాటుచేసి 11 కేవీ లైన్‌కు కలపడం జరిగిందని.. ఇక ఎట్టి పరిస్థితుల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడదని చెప్పారు. రెండు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను సైతం ఏర్పాటు చేసి వారం రోజుల్లో సమస్య పూర్తిగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఏడీఈ తుమ్మల వంశీ, ఏఈ శివకుమార్, లైన్‌ఇన్‌స్పెక్టర్ పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో గందరగోళం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పలు పోస్టుల కోసం ఒప్పంద, పొరుగుసేవల పద్ధతిలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో గత ఏడు నెలలుగా డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు నిరుద్యోగులతో ఆటలాడుకుంటున్నాయనే విమర్శలు వినవస్తున్నాయి. ఎన్నికల కోడ్, డీఎంహెచ్‌వోలు మారడం కారణాలతో నెలల తరబడి భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా ఈ నెలలో సదరు ఉద్యోగాలకు ప్రొవిజనల్ జాబితా వేసి నిరీక్షించడం, మెరిట్ జాబితా కోసం మరికొన్నాళ్లు ఆగడంతో అభ్యర్థుల్లో తీవ్ర అసహనం వ్యక్తమైంది. తిరిగి సెప్టెంబర్ 26న మెరిట్ జాబితాను జిల్లా వైద్యాధికారులు ప్రకటించారు. మెరిట్ జాబితాను కూడా అదే రోజు జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచకపోవడంతో విమర్శలు వ్యక్తమయ్యాయి. సెప్టెంబర్ 28 ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి ఆర్డర్ కాపీలను అదే రోజు ఇస్తామని తొలుత అధికారులు ప్రకటించారు. కానీ మరుసటి రోజైనా ఇవ్వకపోతారనే ఆశతో అభ్యర్థులు నిరీక్షించినా ఫలితం లేకుండా పోయింది. వారం రోజులుగా ఎంపికైన పలువురు అభ్యర్థులు డీఎంహెచ్‌వో కార్యాలయానికి తిరిగి విసిగి వేసారిపోతున్నా వారికి సమాధానం చెప్పే నాధుడు కరవయ్యారు. ఈ మేరకు గురువారం పలువురు అభ్యర్థులు డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చి పోస్టింగ్ ఆర్డర్ల కోసం గంటల తరబడి నిరీక్షించి నిరాశతో వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు పలువురు విలేకరులతో మాట్లాడుతూ.. పలు ఉద్యోగాల కోసం కొందరు పైరవీలు ప్రారంభించడంతోనే ప్రక్రియ ముగిసినా, ఎంపికైన తమకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారనే అనుమానం వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

అందరం ఒకటిగా.. ర్యాగింగ్‌కు దూరంగా



ఇంజినీరింగ్, ఫార్మసీ తరగతులు ఇటీవల ప్రారంభమయ్యాయి. నీట్ కౌన్సెలింగ్ ముగించుకొని త్వరలో వైద్య విద్యార్థులు కళాశాలలకు రానున్నారు. కొత్త కళాశాలలు.. కొత్త వాతావరణం.. దీనికి తోడు ర్యాగింగ్ భయం. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని బయటకొచ్చిన విద్యార్థులకు ఇక్కడ కాస్త బెరుకుగానే ఉంటుంది. సీనియర్ల శ్రుతి మించిన చేష్టలు వారిని ఆందోళనకు గురిచేస్తుంటాయి. ఈ భయం పోగొట్టడానికి కళాశాలల్లో యాజమాన్యాలు, అధ్యాపకులు కృషి చేయాలి..

–న్యూస్‌టుడే, విద్యానగర్, హసన్‌పర్తి

● 2021 సెప్టెంబర్.. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం సృష్టించింది. ఉత్తరాదికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తకు చెందిన విద్యార్థిని ర్యాగింగ్ చేయడం సంచలనం సృష్టించింది. కేంద్రస్థాయిలో ఒత్తిడి రావడంతో విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు.

● గతేడాది రాజస్థాన్‌కు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థిని ర్యాగింగ్ చేసిన ఏడుగురు విద్యార్థులపై మట్టెవాడ పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఈ విషయంలో జాగ్రత్త..

- ఇతర విద్యార్థుల పట్ల అమానుషంగా, కఠినంగా వ్యవహరించడం
- మొబైల్ ఫోన్ల ద్వారా ఫొటోలు, వీడియోలు తీయడం
- శారీరకంగా, మానసికంగా వేధించడం
- సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా ప్రవర్తించడం

ఏం చేయాలంటే..

ర్యాగింగ్ నిరోధానికి ప్రభుత్వం 1997లో చట్టం తీసుకొచ్చింది

- ప్రతి విద్యాసంస్థలో అనుభవం ఉన్న ప్రొఫెసర్, స్థానిక పోలీసు అధికారి భాగస్వామ్యంతో కమిటీలను ఏర్పాటు చేయాలి.
- చట్టాలను అతిక్రమిస్తే విధించే శిక్షలు తెలిపే బోర్డులను ప్రతి విద్యాలయంలో అందరికీ కనిపించే ప్రదేశాల్లో ఉంచాలి.

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక గోడపత్రాలు ప్రదర్శిస్తామని రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు.

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు (ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలు)

ఇంజినీరింగ్ కళాశాలు	7
పీజీ	72
ఫార్మసీ	37
డిగ్రీ	262
ఎంబీఏ, ఎంసీఏ	30
గురుకుల డిగ్రీ	30
బి.ఎడ్	41
న్యాయ	4

అతిక్రమిస్తే శిక్షలు తప్పవు..

- రూ.2.50 లక్షల వరకు జరిమానా.
- సదరు విద్యార్థి ప్రవేశం రద్దు చేసి, కళాశాల నుంచి బహిష్కరణ.
- మరే ఇతర కాలేజీలో చేరే అవకాశం లేకుండా చేయటం.
- పోలీసు కేసు నమోదు..



కేయూలో యాంటీ ర్యాగింగ్ గోడపత్రిక విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, అధ్యాపకులు

పకడ్బందీగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు..

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ శివారులోని ఎస్సార్ విశ్వవిద్యాలయం, భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 2009లో యాంటి ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఏటా బీటెక్, ఫార్మసీ, ఎంబీఏ, అగ్రికల్చర్ బీఎస్సీలో చేరుతున్న విద్యార్థులకు ర్యాగింగ్ సమస్య తలెత్తకుండా విశ్వవిద్యాలయం అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పూర్తికాగానే యాంటి ర్యాగింగ్‌పై సదస్సులు ఏర్పాటు చేసి, పోలీసు అధికారులతో పాటు ఇతర శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో అవగాహన కల్పిస్తున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే పోలీసు శాఖ చర్యలు, చట్టాల గురించి వివరిస్తున్నారు. దీనికి తోడు క్రమశిక్షణ కమిటీలను ఆయా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘం ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేస్తున్నారు. ర్యాగింగ్ రహిత విశ్వ విద్యాలయాలుగా తీర్చిదిద్దడానికి అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులు కృషి చేస్తున్నారు.


డయల్ 100కు కాల్ చేయండి..: - ఎస్‌కె. సలీమా, సెంట్రల్ జోన్ డీసీపీ



ఎస్సార్ విశ్వ విద్యాలయంలో జరిగిన యాంటీ ర్యాగింగ్ సదస్సులో మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

విద్యార్థులకు ర్యాగింగ్ సమస్య ఎదురైనప్పుడు డయల్ 100కు కాల్ చేయాలి. 5 నిమిషాల్లో పోలీస్ పెట్రోలింగ్ వాహనం మీ ముందు ఉంటుంది. విద్యార్థినులకు రక్షణగా షీ బృందాలు 24 గంటలు అందుబాటులో ఉంటాయి. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు పోటీ తత్వంతో చదవాలి. ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువును కొనసాగించాలి. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.

పరిచయ కార్యక్రమాలతో ప్రోత్సాహం



- ప్రవళిక, ఇంజినీరింగ్ మూడో సంవత్సరం, మహిళా ఇంజినీరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్

విద్యా సంవత్సరం ప్రారంభంలో అధ్యాపకుల సహకారంతో మొదటి సంవత్సరం విద్యార్థులతో పరిచయ కార్యక్రమాలు నిర్వహిస్తాం. దీనిద్వారా కొత్తవారికి భయం పోతుంది. వారిని సహ సంబంధ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తాం. కలివిడిగా ఉండడం ద్వారా సీనియర్, జూనియర్ అనే తేడా ఉండదు.

భయం పోయింది..



- యాకేష్, ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం, కోఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్

ఇంటర్ తర్వాత ఇంజినీరింగ్ అంటే కొంత భయంగా ఉండేది. సీనియర్లు మమ్మల్ని ప్రోత్సహించే విధంగా ఉండాలి. అధ్యాపకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల బిడియం, భయం పోయాయి. సందేహాల నివృత్తికి సీనియర్, జూనియర్ విద్యార్థుల భాగస్వామ్యం అవసరం.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



బాలాత్రిపుర సుందరీగా భద్రకాళి



జ్యోతి వెలిగించి ఉత్సవాలు ప్రారంభిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు

రంగంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన శ్రీభద్రకాళి అమ్మవారి ఆలయంలో గురువారం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు బాలా త్రిపురసుందరీగా శ్రీభద్రకాళి అమ్మవారు దర్శనమిచ్చారు. అంతకుముందు ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి పూర్ణాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవానుజ్ఞ ప్రార్థన, గణపతి పూజ, ధ్వజారోహణం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలను భద్రకాళి అమ్మవారికి అలంకరించారు. ఉదయం వృషభ వాహన సేవ, సాయంత్రం మృగ వాహన సేవలు జరిగాయి. భవానీ దీక్షదారులు, భక్తులు, మహిళలతో దేవాలయం కిటకిటలాడింది. మధ్యాహ్నం, రాత్రి మహా అన్నదానం చేశారు.

● రెండోరోజు శుక్రవారం శ్రీభద్రకాళి అమ్మవారిని అన్నపూర్ణ మాతగా అలంకరిస్తారని, ఉదయం బ్రహ్మచారిణి దుర్గార్చన, 11 గంటలకు మకర వాహన సేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవలుంటాయని ఈవో శేషుభారతి తెలిపారు.

తొర్రూరులో 'కాసం ఫ్యాషన్స్' ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి ప్రియాంక మోహన్, నిర్వాహకులు

తొర్రూరు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని టీచర్స్ కాలనీ ప్రధాన రహదారి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'కాసం ఫ్యాషన్స్' మాల్ 13వ స్టోర్‌ను గురువారం సినీనటి ప్రియాంక మోహన్ ప్రారంభించారు. మొదట జ్యోతి వెలిగించి మాల్‌లోని లేడీస్, జెంట్స్, కిడ్స్‌వేర్ దుస్తులను పరిశీలిస్తూ సందడి చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన అధునాతన వస్త్రాలను సరసమైన ధరలకే అందించడానికి కాసం సెలక్షన్స్ నూతన స్టోర్‌ను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. షాపింగ్‌మాల్ డైరెక్టర్లు కాసం ఓంనమఃశివాయ, మల్లికార్జున్, కేదారినాథ్, శివప్రసాదులు మాట్లాడుతూ.. బతుకమ్మ, దసరా, దీపావళి సందర్భంగా నూతన స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. సినీనటి ప్రియాంకమోహన్‌ను చూడటానికి యువత పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో నిర్వాహకులు కాసం ఫణి, సాయికృష్ణ, ధీరజ్, ప్రీతమ్, ప్రవీణ్, పల్లూరి అరుణ్‌కుమార్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

● సినీనటి ప్రియాంకమోహన్‌తోపాటు కాంగ్రెస్ పాలకుర్తి ఇన్‌ఛార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మాల్ ముందు ఏర్పాటు చేసిన స్టేజిని ఎక్కుతున్న తరుణంలో అది ఒక్కసారిగా కూలిపోయింది. ఝాన్సీరెడ్డికి గాయాలు కావడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మిగతా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు సెమీస్‌కు చేరాయి. గురువారం కోమటిపల్లి మైదానంలో నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఖమ్మం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. విక్రాంత్‌రెడ్డి 137 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఖమ్మం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి.. సెమీస్‌లోకి దూసుకెళ్లింది. దివిన్ 75, రత్న ఆర్యన్ 45 పరుగులతో విజయంలో కీలకపాత్ర పోషించారు.

● మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్ ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో విజ్ఞాన్ 59 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఆదిలాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 వద్ద కుప్పకూలింది. జట్టులో ఆల్‌రౌండర్ తక్షిల్ 39 పరుగులు చేసి 3 వికెట్లు తీశాడు. శుక్రవారం కోమటిపల్లి మైదానంలో కరీంనగర్, నల్గొండ: మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల మధ్య సెమీస్ మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

చికెన్ ధరలు (కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	112
రిటైల్:	134
డ్రెస్డ్:	194
స్కిన్‌లెస్:	221

అడవిని చూసొద్దాం.. వన్యప్రాణులను కాపాడుదాం

ఏటూరునాగారం అభయారణ్యంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన కెమెరాలకు ఇటీవల చిక్కిన వన్యప్రాణులు..

















రోజురోజుకు వన్యప్రాణులు అంతరించిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం వాటి రక్షణకు చర్యలు చేపడుతున్నా వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో విస్తారంగా ఉన్న అటవీ ప్రాంతంలో అనేక అరుదైన వన్యప్రాణులు ఉన్నాయి.. మనకు విస్తారమైన అటవీ ప్రాంతం ఉంది. ఆ అందాలను వీక్షిస్తూనే అందులో నివసిస్తున్న వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉంది.. శుక్రవారం ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

ఏటూరునాగారం, న్యూస్‌టుడే

● ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం 6.26 లక్షల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి.

సంరక్షణ చర్యలు ఇలా..

ఏటూరునాగారం అభయారణ్యం మొత్తం 806 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 146 గ్రామాలతో, ఏటూరునాగారం నాలుగు రేంజి కార్యాలయాలతో విస్తరించి ఉంటుంది. ఇందులోని వన్యప్రాణులను కాపాడేందుకు అటవీ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. సాసర్ పిట్లు, నీటి తొట్టెలలో ప్రతి రోజూ నీటిని పోయడం, నిర్మానుష్య ప్రదేశాలలో అడవి జంతువులు సంచరించే ప్రాంతాల్లో ఉప్పు గడ్డలు వేయడం, పచ్చిగడ్డిని నీటి తొట్లు, సాసర్‌పిట్లు ఉన్న చోట వేయడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. అటవీ అధికారులు ఎవరి బీట్ పరిధిలో వారు నిత్యం క్షేత్రస్థాయి పర్యటన చేస్తూ అడవులో వేటగాళ్లు విద్యుత్తు తీగలు అమర్చారా, ఉచ్చులు అమర్చారా అని పర్యవేక్షిస్తుంటారు. అడవి జంతువులు ఆనవాళ్లు ఎక్కడ ఉన్నాయి, ఉన్నాయా? లేవా అని తెలుసుకునేందుకు అవి సంచరించే నిర్జన ప్రదేశాల్లో కెమెరా ట్రాప్స్ ఏర్పాటు చేస్తారు. ప్రధానంగా అడవిలో నీటి వనరులున్న చోట కెమెరా ట్రాప్‌లు, ఉప్పు గడ్డల వంటివి ఏర్పాటు చేసి వాటి ఆనవాళ్లు సేకరిస్తారు.



ఏటూరునాగారం సబ్ డివిజన్‌లోని అడవి విస్తీర్ణం తెలిపే మ్యాపు

● ములుగు జిల్లాలో 7,27,821 ఎకరాల్లో అడవులు ఉన్నాయి. ములుగు, తాడ్వాయి, వెంకటాపురం, ఏటూరునాగారం సబ్ డివిజన్లతో 13 అటవీ రేంజి కార్యాలయాలతో 77 బ్లాకులతో అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ పని చేస్తోంది. ఇందులో 806.15 చదరపు కిలో మీటర్ల పరిధిలో వన్యప్రాణి సంరక్షణ కేంద్రం విస్తరించి ఉంది.

చట్టం ఏం చెబుతుందంటే..

వన్యప్రాణులను వేటాడటం నిషేధమని వన్యప్రాణుల సంరక్షణ చట్టం-1972 చెబుతోంది. అభయారణ్యంలో వేటగాళ్లు నిత్యం అడవి జంతువుల పాలిట మరణమృదంగాన్ని మోగిస్తూనే ఉన్నారు. వేటగాళ్లు అమర్చే ఉచ్చులు, విద్యుత్తు తీగలు వన్యప్రాణుల ప్రాణాలు ఏదో ఒక ప్రాంతంలో కబలిస్తూనే ఉన్నాయి.

● వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం అటవీ జంతువులను వేటాడినట్లు రుజువైతే మూబడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధిస్తారు. ఏ ఒక్కరికీ ఈ శిక్షలు పడిన దాఖలాలు లేవు.

వారోత్సవాలకు శ్రీకారం..



వన్యప్రాణుల సంరక్షణకు పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక(యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్), జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడిగా కృషి చేస్తున్నామని విశ్రాంత జిల్లా అటవీ అధికారి కాజీపేట పురుషోత్తం అన్నారు. ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు ఇందారం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఈ సంస్థలు వన్యప్రాణులు అంతరించిపోకుండా సంరక్షణకు నడుం బిగించాయి. ఈ నెల 2 నుంచి 8 వరకు జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఆరుబయట ఆసుపత్రి వ్యర్థాలు



వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలో..

నగరంలో ఆసుపత్రి వ్యర్థాలు యథేచ్ఛగా ఆరుబయట పడేస్తున్నారు. 'బయో మెడికల్ వేస్ట్ ప్లాంట్'కు తరలించాల్సిన వాటిని వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలో కుప్పలుగా పోశారు. ప్రతి ఆసుపత్రిలోని వ్యర్థాలను 'బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్'కు అప్పగించాల్సి ఉంటుంది. నేత్ర వైద్యశాలలో అలా చేయకుండా ఆసుపత్రి ఆవరణలో పడేయడంతో కుక్కలు, పందులు వాటిని చిందరవందర చేస్తున్నాయి. దీనివల్ల అనేక అనర్థాలు జరుగుతాయని తెలిసినా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి



నీటిలో పచ్చని ప్రతిబింబం..!

మహబూబాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని కంబాలపల్లి చెరువు చుట్టూ ప్రకృతి సౌందర్యం కనువిందు చేస్తోంది. ఇటీవల కురిసిన భారీవర్షాలకు జలకళ సంతరించుకొంది. జలాశయం చుట్టూ ఉన్న పచ్చని చెట్లతోనిండిన గుట్ట ప్రతిబింబం చెరువులో పచ్చందాలు పరిచినట్లు కనిపిస్తూ చూపరులను ఆకట్టుకొంటోంది. –న్యూస్‌టుడే, మహబూబాబాద్ రూరల్

వృత్తి నైపుణ్యంతోనే విధుల్లో రాణింపు



పోలీసు డ్యూటీ మీట్‌లో అధికారుల పనితీరును పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీశాఖలో పనిచేస్తున్న అధికారులు విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో వరంగల్, ఖమ్మం కమిషనరేట్లు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అధికారుల జోనల్ డ్యూటీ మీట్‌ను ఆయన ప్రారంభించారు. పోలీసు అధికారులకు కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, వేలిముద్రల సేకరణ, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, విడియోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఒక్కో విభాగంలో ఇద్దరు చొప్పున ప్రతిభ కనబర్చినవారిని ఎంపిక చేసి, హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోలీసు డ్యూటీ మీట్‌కు పంపించనున్నారు. సీపీ మాట్లాడుతూ.. నేరాలు కొత్తకొత్త పద్ధతుల్లో జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలంటే.. విచారణ నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. అదనపు డీసీపీ రవి, జోనల్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క మది దోచిన 'ఈనాడు' చిత్రం

ప్రకృతి పర్యాటకానికి ప్రసిద్ధి గాంచిన ములుగు జిల్లాలోని అడవుల అందాలను 'అచ్చంగా అమెజాన్ అడవిలా.. కొండ్రేడు అందాలిలా.. అనే శీర్షికతో గురువారం ఈనాడు ప్రధాన పత్రిక మొదటి పేజీలో ప్రచురితమైన చిత్ర కథనం మంత్రి సీతక్కను అమితంగా ఆకర్షించింది. ప్రకృతి రమణీయ చిత్రాన్ని 'ఈనాడు' రాష్ట్రానికి తెలియజేయడం అభినందనీయమని అన్నారు. ములుగు జిల్లాలో గురువారం ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగపేటలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈనాడు చిత్ర కథనాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు.

–మంగపేట, న్యూస్‌టుడే

భారీగా గుట్కా పట్టివేత



గుట్కాను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: అక్రమంగా రవాణా చేస్తున్న నిషేధిత గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు... కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ఆర్.శ్రీధర్ వ్యాన్‌లో గుట్కా తీసుకొని వరంగల్‌లోని పాన్ దుకాణానికి సరఫరా చేసేందుకు వస్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిఘా ఉంచారు. గురువారం ఎనుమమూల ఠాణా పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో వివిధ కంపెనీలకు చెందిన రూ.8.91లక్షల విలువ చేసే గుట్కా లభించింది. వ్యాన్‌ను సీజ్ చేసి, పాన్ దుకాణం యజమాని కృష్ణతో పాటు సరఫరా చేస్తున్న శ్రీధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు, విచారణ కోసం ఎనుమమూల పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆర్ఎస్సై భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బామ్మ బంగారం.. దొరికిందోచ్!



కొంతమందికి పట్టిందల్లా బంగారం అవుతుందని అంటారు.. నిజమే..! తెలియకుండానే ఓ వ్యక్తి బియ్యం పట్టుకుంటే బంగారం అయ్యింది.. అది ఎంతోసేపు నిలవలేదు. చివరికి వచ్చిన చోటుకే చేరి కథ సుఖాంతమైంది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన కట్ల సోమలక్ష్మి అనే వృద్ధురాలు ప్రభుత్వం ఇచ్చిన రాయితీ బియ్యం సంచిలో ఐదు తులాల బంగారం దాచి పెట్టింది. గ్రామంలో ఓ వ్యక్తికి మంగళవారం సాయంత్రం ఆ బియ్యం సంచి విక్రయించింది. బంగారం దాచుకున్న సంచి వేరే ఉందని భావించింది. అయితే ఆ సంచిని తెరిచి చూడగా అందులో బంగారం కనిపించలేదు. బంగారం దాచిన బియ్యం సంచినే విక్రయించినట్లు గుర్తించి లబోదిబోమంటూ విషయం కుటుంబసభ్యులకు వివరించింది. బియ్యం కొనుగోలు చేసిన వ్యక్తి మరుసటి రోజు మళ్లీ అదే గ్రామానికి రాగా అతన్ని పట్టుకొని విషయం చెప్పగా.. గ్రామంలోని ఓచోట 15 బస్తాల వరకు బియ్యాన్ని నిల్వ చేసినట్లు చెప్పాడు. కుటుంబసభ్యుల సాయంతో బియ్యం సంచులను విప్పి వెతకగా బంగారం దొరికింది. దీంతో వృద్ధురాలు సోమలక్ష్మితో పాటుగా కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

– న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్

పాలకుర్తి బస్‌స్టేషన్‌కు కొత్తకళ



పాలకుర్తిలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు ఎట్టకేలకు కొత్తకళ వచ్చింది. గత నాలుగైదు రోజులుగా స్టేషన్ నుంచి బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. గతంలో రాజీవ్‌చౌరస్తాలోనే నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తేవి. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు ఆర్టీసీ అధికారులకు సమాచారం అందజేసి, అసంపూర్తిగా ఉన్న పాలకుర్తి బస్ స్టేషన్‌ను శుభ్రం చేసి, వినియోగంలోకి తెచ్చారు. ఫలితంగా బస్టాండుకు కొత్త కళ వచ్చిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. – న్యూస్‌టుడే, పాలకుర్తి

రహదారి గుంతలమయం



జనగామ మండలంలోని మరిగడి-గానుగుపహాడ్ గ్రామాల మధ్య రహదారి పూర్తి అధ్వానంగా మారింది. గత 15 ఏళ్ల క్రితం పంచాయతీరాజ్ శాఖ నిధులతో బీటీ రోడ్డు నిర్మించారు. ఆ తర్వాత మరమ్మతులపై అధికారులు పట్టించుకోకపోవడంతో గుంతలమయంగా మారి, రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ దారి గుండా నిత్యం వందలాది మంది వాహనదారులు ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. బాగుచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా స్పందన కరవైందని యువజన సంఘాల నాయకులు వాపోతున్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ శ్రీనివాస్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా. . బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. – న్యూస్‌టుడే, జనగామ రూరల్

వీరగాథలు 4.0



చిల్పూరు ఉన్నత పాఠశాలలో వీరగాథల వివరాలు తిలకిస్తున్న విద్యార్థులు

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించి సానుకూలంగా స్పందించి, మానసికంగా సిద్ధం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వీరగాథ్ 4.0ను తిలకించి విద్యార్థులకు వివరించాలని జిల్లా విద్యాశాఖాధికారుల ద్వారా ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. 2021లో గ్యాలంటరీ అవార్డు పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వ ఆశయాలకు తగ్గట్టు ఇప్పటికి మూడు తడవల్లో లక్షలాది మంది విద్యార్థులు తిలకించినట్లు తెలిపింది. తాజాగా 4.0 ను అందుబాటులోకి తెచ్చింది. దేశం కోసం నిస్వార్థంగా ప్రాణాలను పణంగాపెట్టి పోరాడిన వీరులను కేంద్రం గ్యాలెంటరీ అవార్డులిచ్చి సత్కరిస్తుంది. వారి విజయగాథలు, దేశభక్తి తదితర వివరాలు దృశ్యరూపకంగా ప్రసారం చేస్తున్నారు. వీటిని విద్యార్థులు వీక్షించి తగు విధంగా స్పందించి సృజనాత్మకంగా మదిలోని భావాలను వెలిబుచ్చాలని సూచించింది.

☛ మూడెంచెల్లో(జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో) వడపోసే ఈ పోటీలను నాలుగు విభాగాలుగా విభజించారు. జాతీయ స్థాయిలో మెరిసిన వంద మంది విద్యార్థులను రూ. 10వేల పారితోషికంతో భారత రక్షణ మంత్రిత్వశాఖ విద్యాశాఖ సంయుక్తంగా అభినందిస్తాయి. మూడు నుంచి ఐదు తరగతులు ఆరు నుంచి ఎనిమిది, తొమ్మిది, పది, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పోటీలో పాల్గొనే వీలుంది. ప్రతి విభాగంలో పాతిక మంది చొప్పున మొత్తం 100 మంది ప్రతిభావంతులను గుర్తిస్తారు.

☛ సృజనాత్మక గేయాలు లేదా 150 పదాలకు మించని వ్యాసం లేదా చిత్రలేఖనం, పెయింటింగ్ లేదా మల్టీమీడియా ద్వారా సమర్పణ తెలపాల్సి ఉంటుంది. తొలుత పాఠశాల స్థాయిలో అక్టోబర్ దసరా సెలవుల అనంతరం నిర్వహించి ఆనక జిల్లా స్థాయి మదింపునకు పంపాలి. అక్కడి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీకి పరిశీలిస్తారు. నాలుగు నెలలపాటు సాగే ఈ ప్రక్రియ తుది ఫలితాలు డిసెంబర్ నెలాఖరు నాటికి ప్రకటించి, జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున విజేతలకు అభినందన కార్యక్రమం ఉంటుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్:80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

వెలిగిన వీధి దీపాలు

జనగామ, న్యూస్‌టుడే: జనగామ రుద్రమ దేవి సొసైటీ భవనం సమీపంలోని వీధిలో గత కొద్ది రోజులుగా దీపాలు వెలగడం లేదని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా దృష్టికి తెచ్చారు. సమస్యను ఎంఈ మహిపాల్ దృష్టికి తీసుకువెళ్లగా మరమ్మతు చేయించారు.

● స్థానిక 26వ వార్డులో బ్రాహ్మణ వీధి, రెడ్డివాడ, ధర్మశాల, కూరగాయల మార్కెట్-పోలీస్ స్టేషన్ ఏరియాలో ఈ మాదిరి సమస్యల ఉండగా 'న్యూస్‌టుడే' ఎంఈకి వివరించగా, ఈఈఎస్ఎల్ ప్రతినిధులు బుధవారం సమస్యను పరిష్కరించడంతో బతుకమ్మ పండగ వేళ వార్డులో చీకట్ల సమస్య తొలగింది.

స్పందనకు వందనం

మురుగు కాల్వలు శుభ్రం

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని గూడూరులో ప్రధాన మురుగుకాల్వల్లో చెత్తచెదారం, పూడికమట్టి పేరుకు పోవడంతో రమేశ్ అనే వ్యక్తి 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. ఈ సమస్యపై ఎంపీడీవో రాములు సానుకూలంగా స్పందించి, సిబ్బందితో వ్యర్థాలు తొలగించారు.

స్తంభాన్ని నిలబెట్టారు



కొడకండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని నర్సింగాపురం శివారులో ఓ లారీ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగి సరఫరా నిలిచిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నదాతలు మేమున్నాం.. మీకు తోడుగా దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను 'న్యూస్‌టుడే' ఏఈ రాములుకు వివరించగా, ఆయన స్పందించి గురువారం నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసి, సరఫరా పునరుద్ధరించారు. దీంతో కర్షకులు ఈనాడుకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

దేవీ శరన్నవరాత్రులు షురూ!



బచ్చన్నపేట శివారు ఎద్దుగూడెంలో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలో పలు చోట్ల అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవీగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, సహస్ర అర్చన, కుంకుమార్చన, చేపట్టారు.
– న్యూస్‌టుడే, బృందం



తరిగొప్పుల చెన్నకేశవ ఆలయ ప్రాంగణంలో..



రఘునాథపల్లి శ్రీ కన్యకపరమేశ్వరి ఆలయంలో...



జనగామలో ప్రత్యేక అలంకరణలో..



జఫర్‌గఢ్ : కూనూర్‌లో..



నర్మెట్ట: వెల్దండలో..



స్టేషన్‌ఘన్‌పూర్ : తాటికొండలో అమ్మవారికి పూజలు

పకడ్బందీగా ధ్రువపత్రాల పరిశీలన..



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియలో ఎలాంటి లోపాలు, ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా జరపడానికి సంబంధిత అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను పట్టణంలోని ప్రిస్టన్ పాఠశాల ఆవరణలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా, ఆయన పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పరిశీలకురాలు విజయలక్ష్మి, డీఈవో రాము, అధికారులు శ్రీధర్, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో మెరిసిన 'లక్ష్య' క్రీడాకారులు



ప్రతిభ చూపిన క్రీడాకారులతో కోచ్ రంజిత్‌కుమార్

జనగామ, న్యూస్‌టుడే: తెలంగాణ పదో రాష్ట్ర స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేవారిని ఎంపిక చేసేందుకు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో లక్ష్య క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించారు. గురువారం స్థానిక ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగిన పోటీల్లో 18ఏళ్ల బాలుర విభాగంలో జి.సునీత్‌కుమార్ షాట్‌పుట్‌లో ప్రథమ, డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. బి.సుమన్‌నాయక్ డిస్కస్ త్రోలో ప్రథమ, ఇ.బన్ని 1500 మీటర్ల పరుగులో ప్రథమ, జె.రౌనాక్ హామర్, డిస్కస్‌లో ముందున్నారని, వై.చరణ్ 400, 200మీటర్ల పరుగులో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచినట్లు 'ఈనాడు' లక్ష్య కోచ్ రంజిత్‌కుమార్ తెలిపారు. బాలికల విభాగంలో ఎం.అక్షయ సింధు షాట్‌పుట్, డిస్కస్‌లో మొదటి స్థానంలో నిలిచిందని, వారికి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు ప్రశంసలు అందించారని కోచ్ పేర్కొన్నారు.

నూతన ఎస్సైగా హమీద్



బచ్చన్నపేట, న్యూస్‌టుడే: బచ్చన్నపేట ఎస్సైగా ఎస్‌కే.హమీద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై సతీశ్ బదిలీపై వరంగల్‌కు వెళ్లగా వీఆర్ వరంగల్ నుంచి హమీద్ బదిలీపై బచ్చన్నపేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పోలీసు సిబ్బంది, పలు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన సతీశ్

తరిగొప్పుల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బొత్తలపర్రె గ్రామానికి చెందిన భూక్య సతీశ్ అనే వ్యక్తి అదృశ్యం అవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్వేత తెలిపిన ప్రకారం.. సతీశ్ గత నెల(సెప్టెంబర్) 30వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికారు. అయినా ఆచూకి లభించడంతో గురువారం తండ్రి సక్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదంలో ఏఎన్ఎంకు తీవ్రగాయాలు

తరిగొప్పుల, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడటంతో ఏఎన్ఎంకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకుషాపూర్ ఆరోగ్య ఉపకేంద్రంలో ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న అన్నపూర్ణ పనులు ముగించుకొని తరిగొప్పులకు ఓ వాహనాన్ని లిఫ్ట్ అడిగి వెళ్తుండగా మధ్యలో బండి అదుపుతప్పి కిందపడటంతో ఆమె రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జనగామ ఏరియాసుపత్రికి తరలించారు. వాహనదారుడికి ఎలాంటి గాయాలు జరగలేదు.

మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున ఇర్రి అహల్య

జనగామ టౌన్, న్యూస్‌టుడే: అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో రమాదేవి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఐద్వా జిల్లా మహాసభలు పట్టణంలోని ఓ వేడుకల మందిరంలో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభకు ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు ఆశాలత పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి షబానా, ప్రతినిధులు కల్యాణి, మోకు భవాని, వరలక్ష్మి, శ్రీలత, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సర్వే సకాలంలో పూర్తి చేయాలి



జనగామ మండలం పెద్దతండా(వై)లో సర్వే పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ రూరల్, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డుల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేను సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని జిల్లా అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ ఆదేశించారు. జనగామ మండలం పెద్దతండా(వై) గ్రామంలో ఇంటింటా డిజిటల్ సర్వేను గురువారం ప్రారంభించగా, ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జడ్పీ సీఈవో సరిత, ఎంపీడీవో సంపత్‌కుమార్, ఎంపీవో రఘురామకృష్ణ, గ్రామ కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

పాలకుర్తి, న్యూస్‌టుడే: డిజిటల్ కార్డు సర్వేను పారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఆర్డీవో వెంకన్న సూచించారు. గురువారం పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన మండలంలోని రాఘవాపురం, చీమలబాయి తండాలో సర్వేను వారు పరిశీలించారు. సర్వేలో లోటుపాట్లకు ఆస్కారం ఉండకూడదని, కచ్చితమైన సమాచారం పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ఆర్ఐ రాకేష్, కార్యదర్శి యుగేంధర్ పాల్గొన్నారు.

పేదల పక్షాన సీపీఎం రాజీలేని పోరాటం



జెండావిష్కరిస్తున్న మోకు కనకారెడ్డి

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: పేదల పక్షాన నిలిచి సమస్యలపై సీపీఎం రాజీలేని పోరాటం సాగిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. గురువారం బచ్చన్నపేట మండలం తమ్మడపల్లిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి, జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా కార్మికుల హక్కులను హరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, సభ్యులు ఎల్లయ్య, రామగళ్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కళాజాత



బచ్చన్నపేట, న్యూస్‌టుడే: సైబర్ క్రైమ్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ పలువురు కళాకారులు గురువారం బచ్చన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో కళాజాత ప్రదర్శించారు. అనుమానిత వ్యక్తులకు చరవాణి ఇవ్వొద్దని, అపరిచిత ఫోన్‌ల నుంచి కాల్ వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాకారుల టీం లీడర్ పిన్నింటి రత్నం, కానిస్టేబుళ్లు నర్సిరెడ్డి, జమాలోద్ధన్, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి



దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: రైతు రుణమాఫీ, తదితర హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని నేడు(శుక్రవారం) తొర్రూరులో భారాస తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తీగల దయాకర్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన నాయకుడు పల్లా సుందర్‌రాంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, మాజీ మండలాధ్యక్షుడు బస్వ మల్లేశం, మాజీ ఎంపీపీ కొల్లూరి సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ వార్తలు

గీత కార్మికులకు స్వీయ రక్షణపై శిక్షణ



రఘునాథపల్లి, న్యూస్‌టుడే : స్వీయ రక్షణపై గురువారం మండలంలోని వెల్దిలో పలు గ్రామాల గీత కార్మికులకు శిక్షణ ఇచ్చారు. బీసీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ అధికారులు కుమారస్వామి, రాజేశ్, యాకూబ్ నేతృత్వంలో ఖిలాషాపురం, అశ్వరావుపల్లి, మండలగూడెం, జాఫర్‌గూడెం గ్రామాల్లో 90 మంది కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ మోకులపై శిక్షణ ఇచ్చారు. కార్మికులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కార్మిక సంఘం జిల్లా సమన్వయకుడు వెంకటమల్లయ్య కోరారు. కార్యక్రమంలో శిక్షకులు గూడ రవీందర్, వడ్లకొండ వెంకటేశ్, సంతోశ్ కుమార్, పోతుల ఆంజయ్య, బాల్నె కార్తిక్, సంఘం మండల అధ్యక్షుడు బుర్ర లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భారీ వర్షానికి దెబ్బతిన్న వరి



గిద్దబండా తండాలో...

రఘునాథపల్లి, న్యూస్‌టుడే : మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ గాలివానకు వరి పంటలు దెబ్బ తినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గిద్దబండా తండాలో యువ రైతు సృజన్ రాయ్ రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న వరి నేలవాలింది. మేలకగట్టు, ఎర్రగడ్డ తండా, రామరాయిని బంగ్లా, సోమరాజుపల్లి తదితర గ్రామాల్లోనూ వరి పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బస్సు, రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి



జఫర్‌గఢ్, న్యూస్‌టుడే : మండలంలోని తమ్మడపల్లి(ఐ)కి బస్సు సౌకర్యం లేక దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన పలువురు మహిళలు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని గురువారం కలిసి విన్నవించారు. మాజీ సర్పంచి గాదెపాక అనితసుధాకర్ ఆధ్వర్యంలో మహిళలు హనుమకొండలో ఎమ్మెల్యేను కలిశారు. దశాబ్దాలుగా ఆర్టీసీ బస్సు నడవకపోవడంతో తాము కాలినడక తిమ్మంపేట వరకు వచ్చి బస్సెక్కాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం నుంచి ఉప్పుగల్లు, కస్నాతండాకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి.. మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు మాజీ సర్పంచి తెలిపారు.

బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయం..

స్టేషన్‌ఘన్‌పూర్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాఘవాపూర్ గ్రామానికి చెందిన కొమురయ్య అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా.. విషయం తెలుసుకున్న ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2 లక్షల 50 వేల ఎల్‌వోసీ గురువారం హనుమకొండలోని తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంతోమంది నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని వివరించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



శ్రీనివాస్(పాత చిత్రం)

స్టేషన్‌ఘన్‌పూర్: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తానేధార్‌పల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకొంది. సీఐ వేణు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్‌గౌడ్(55) అనే వ్యక్తి వ్యవసాయంతో పాటు కల్లుగీస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో రూ.8 లక్షల అప్పు చేశాడు. ఎలా తీర్చాలన్న బెంగతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య సరోజన, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చెరువులు నింపాలని వినతి



జనగామ, న్యూస్‌టుడే: బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి మండలంలోని పసరమడ్ల గ్రామ చెరువును నింపాలని కాంగ్రెస్ నాయకులు శివరాత్రి కుమార్, ఎండీ సర్దార్, ఎస్.బిక్షపతి, రైతులు పలువురు నీటిపారుదల శాఖ ఈఈ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. సమస్యను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వివరించగా, ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారని, ఆయన సూచన మేరకు వినతి పత్రం సమర్పించామని వారు పేర్కొన్నారు. బొమ్మకూరు నుంచి నీటి విడుదల ప్రారంభమైందని అధికారులు తెలిపారని వివరించారు.

బొమ్మలతో ఆకర్షణీయంగా అంగన్‌వాడీ కేంద్రాలు



సింగరాజుపల్లిలో..



పెద్దమడూరులో..

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతుంది. ప్రతి కేంద్రంలో ఆకర్షణీయమైన బోర్డు అమరికతో పాటు గోడలపై చిన్నారులను ఆకట్టుకునేలా తైలవర్ణం(ఆయిల్ పెయింట్)తో బొమ్మలను చిత్రీకరించారు. నిర్వహణలో మార్పులు చేర్పులకు టీచర్లు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. అలాగే పిల్లలు ఆడుకునేందుకు వరండా, విశాలమైన గది, వంటావార్పులు నిర్వహించే గది లోపల బయట అంతా రంగుల చిత్రాలు గీశారు. కేంద్రాల సుందరీకరణతో పాటు అన్ని వసతులు అందుబాటులో ఉండటంతో కేంద్రాలకు మరింత మంది చిన్నారులు వస్తున్నారని జిల్లా సంక్షేమాధికారి జయంతి తెలిపారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	695
గర్భిణీలు	2,712
బాలింతలు	2,554
1-6 ఏళ్ల లోపు చిన్నారులు	23,470

నాలుగేళ్లుగా మృత్యువుతో పోరాడి మృతి

లింగాలఘనపురం, న్యూస్‌టుడే : మండలంలోని జాగిళ్లపురం గ్రామానికి చెందిన రమేశ్ స్తంభంపై నుంచి పడిన ప్రమాదంలో మంచానికే పరిమితమై మృత్యువుతో పోరాడుతూ గురువారం మృతి చెందాడు. వివరాలిలా.. రమేశ్ 2020 ఏప్రిల్‌లో కొత్తపల్లిలో విద్యుత్తు నియంత్రిక మరమ్మతు పనుల్లో ఉండగా హఠాత్తుగా విద్యుత్తు సరఫరా జరిగి కిందపడ్డాడు. నాటి నుంచి మంచానికే పరిమితమైన రమేశ్‌కు తల్లిదండ్రులు సపర్యలు చేస్తున్నారు. విద్యుత్తు శాఖ నామమాత్ర సహాయం అందించింది. నాలుగు రోజుల క్రితం పరిస్థితి విషమించగా హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తుండగా.. గురువారం మృతి చెందాడు. కుటుంబంలో విషాదం అలుముకుంది.